సాక్షి
చిత్తూరు
మంగళవారం । 13 । మే । 2025



మా మొర ఆలకించరా?

'అయ్యా.. మా మొర ఆలకించండి. సమస్యలు పరిష్కరించండి' అంటూ పలువురు అధికారులకు మొరపెట్టుకున్నారు. - 8లో



మా భూములు లాక్కోవద్దు

విమానాశ్రయం ఏర్పాటు పేరుతో తమ భూములు లాక్కోవద్దని పలువురు రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. - 8లో



అరటి సాగులో అద్భుతాలు

అరటి సాగులో అద్భుతాలు సృష్టిస్తున్నాడు రామకుప్పం మండలానికి చెందిన యువరైతు జ్ఞానప్రకాష్. - 8లో

న్యూస్‌రీల్

15న హుండీ లెక్కింపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన హుండీని ఈనెల 15వ తేదీన లెక్కించనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 7 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని ఆయన సూచించారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 36 ఫిర్యాదులు



సమస్యలు వింటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో నిర్వహించిన పోలీసు ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 36 వినతులు అందాయి. చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీటిలో కు టుంబ తగాదాలు, వేధింపులు, మోసాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోపు పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా స్టేషన్ హౌస్ అధికారులతో మాట్లాడారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఒక్క సమస్యపై విచారణ చేపట్టి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే చిత్తూరు ఏఎస్పీ రాజశేఖరరాజు, డీటీసీ డీఎస్పీ రాంబాబు కూడా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

వెబ్‌సైట్‌లో టెన్త్ సప్లిమెంటరీ హాల్ టికెట్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 19వ తేదీ నుంచి 28 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో సంబంధిత పాఠశాలల హెచ్ఎంలు లాగిన్‌లను వినియోగించి www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేయాలన్నారు. అదే విధంగా విద్యార్థులు మనమిత్ర వాట్సాప్ 9552300009 నంబర్‌లో హాయ్ అని మెసేజ్ పంపి వివరాలను నమోదు చేసి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న డీఐఈఓ శ్రీనివాసులు, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా 35 పరీక్ష కేంద్రాల్లో సోమవారం నుంచి ఉదయం, మధ్యాహ్నం రెండు షెషన్లలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చిత్తూరు నగరంలోని వివేకానంద, విజయం, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఉదయం నిర్వహించిన మొదటి సంవత్సరం పరీక్షకు జనరల్ విభాగంలో 2,952 మందికి గాను 2,797 మంది హాజరయ్యారు. అదే విధంగా ఒకేషనల్‌లో 255 మందికి గాను 223 మంది హాజరుకాగా 32 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు 25 కేంద్రాల్లో జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో జనరల్ విభాగంలో 683 మందికి గాను 637 మంది, ఒకేషనల్ విభాగంలో 143 మందికి గాను 131 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. కాగా బీఎస్ కణ్ణన్, కృష్ణవేణి, పీసీఆర్ జనరల్, ఒకేషనల్ కేంద్రాలను మధ్యాహ్నం షెషన్స్‌లో డీఐఈఓ శ్రీనివాసులు, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దయానందరాజు, బాలసుబ్రహ్మణ్యం, శరత్‌చంద్రశేఖర్ తనిఖీ చేశారు.



పీసీఆర్ పరీక్ష కేంద్రం వద్ద లోనికి వెళ్లేందుకు నిరీక్షిస్తున్న విద్యార్థులు

ఫ్చ్.. వద్దులే!



'రైతులకు నిత్యం అవసరమైన రొటావేటర్ పరికరానికి వ్యవసాయశాఖ నిర్ణయించిన ధర రూ.1,51,980. ప్రభుత్వం ఇస్తున్న రాయితీ రూ.50 వేలు. రైతు చెల్లించాల్సింది రూ.1.02 లక్షలు. కానీ ఇదే పరికరం మార్కెట్ ధర రూ.1.20 లక్షలు. రాయితీ ఇచ్చినా ధరలో పెద్దగా తేడా లేకపోవడంతో మంచి కంపెనీ నుంచి రొటావేటర్ కొనుక్కోవచ్చని రైతులు భావిస్తున్నారు. అందుకే ప్రభుత్వం ఇస్తున్న రాయితీ పరికరాలపై పెద్దగా ఆసక్తి చూపించలేకపోతున్నారు.'

.. ఇది ఒక్క రొటావేటర్ పరిస్థితే కాదు.. కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల రేట్లన్నీ ఇదేవిధంగా ఉండడంతో రైతులు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. బయట మార్కెట్‌లో మంచి కంపెనీకి చెందిన పరికరాలు కొనుగోలు చేయొచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేక అధికారులు ఆపసోపాలు పడాల్సి వస్తోంది.

సబ్సిడీ వ్యవసాయ పరికరాలపై అనాసక్తి

- రాయితీ పరికరాల కొనుగోలుకు ఆసక్తి చూపించని రైతులు
- మార్కెట్ ధరతో పోలిస్తే తక్కువ లబ్ధే కారణం
- మళ్లీ దరఖాస్తుకు అవకాశమిచ్చిన యంత్రాంగం

చిత్తూరు అర్బన్: అన్నదాత ఖర్చు తగ్గించుకుని లాభసాటి వ్యవసాయం చేసేందుకు ప్రభుత్వం వ్యవసాయ పరికరాలు అందచేయడం పరిపాటి. ఈ క్రమంలో రైతులకు అవసరమైన పరికరాలను అందించాలని కూటమి ప్రభుత్వం భావించింది. వ్యవసాయానికి అవసరమైన యంత్రపరికరాలు ఇవ్వడానికి జిల్లాకు రూ.2.85 కోట్ల వ్యయంతో 1,645 పరికరాల కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఆ పరికరాల కొనుగోలుకు చాలా మంది రైతులు ఆసక్తి చూపడం లేదు.

అనుకున్నదొక్కటి

బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే రాయితీపై ఇస్తున్న పరికరాల ధర ఎక్కువగా ఉండడమే రైతులు వీటిని వద్దనడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. రాయితీ పోను రైతులకు వచ్చే లబ్ధి చాలాతక్కువగా ఉంది. ఫలితంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి వ్యవసాయశాఖ అధికారులు నానాపాట్లు పడుతున్నారు. ఓ వైపు జిల్లా యంత్రాంగం రోజువారీ సమీక్షలు చేస్తూ లక్ష్యం మేరకు రైతులతో రాయితీ పరికరాలు కొనుగోలు చేయించాలని నిర్దేశించారు.



చిత్తూరు మండలంలో రొటావేటర్‌తో రైతు

ఇదేంది ఇలా జరిగిందబ్బా!

రైతుల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉండడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ట్రాక్టరు ఆధారిత పరికరాలకు కేటాయించిన రాయితీ సొమ్మును తైవాన్ స్ప్రేయర్లు వంటివాటికి వాడుకునేలా ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ప్రభుత్వం అందించే రాయితీ పరికరాలు తీసుకోవడానికి రైతులు పోటీపడి ముందుకు వస్తారనుకుంటే పరిస్థితి భిన్నంగా ఉందని మండలాల్లోని వ్యవసాయ అధికారులు వాపోతున్నారు. మండలానికి ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోవడానికి అనేక అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. రొటావేటర్లు, హైడ్రాలిక్ రివర్స్ నాగళ్లు, ట్రాక్టర్ ఆధారిత పనిముట్లను రైతులు కొనుగోలు చేయడం లేదు.

40 శాతం మంది దూరం

సేద్యానికి అవసరమైన యంత్ర సాయం వ్యక్తిగతంగా అందించేందుకు పరికరాలు ఆయా మండలాలకు చేరుస్తున్నారు. తొలుత జిల్లాలోని 36 మండలాల్లో అన్నదాతలకు రొటావేటర్లు, పవర్ టిల్లర్స్, బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ వీడర్లు అందించేందుకు వ్యవసాయశాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ఏడాది మార్చి నెలాఖరులోగానే పరికరాలు అవసరమైన వారి నుంచి వివరాలు సేకరించి అధికారులు ఆన్‌లైన్ చేయించారు. ఐదెకరాల లోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, మహిళ, సన్న, చిన్నకారు రైతులకు వీటిని కేటాయించారు. జిల్లాకు 1,645 యూనిట్ల పరికరాల కేటాయింపే లక్ష్యంగా చేసుకున్నారు. కానీ ఇప్పటివరకు వరకు 1,016 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. అంటే 40 శాతం మంది రైతులు రాయితీ పరికరాలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించడం లేదు. ఫలితంగా ఇప్పటికే గడువు ముగిసినా, లక్ష్యం చేరువుకాకపోవడంతో మిగిలిన యూనిట్లకు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో రాయితీ పరికరాల లక్ష్యాలు

పరికరం	కేటాయింపు	వచ్చిన పరికరాలు
ట్రాక్టర్	740	582
రోటావేటర్	94	76
బ్యాటరీస్ప్రేయర్లు	280	256
పవర్ వీడర్లు	109	89
బ్రష్‌కట్టర్లు	08	02
పవర్ టిల్లర్స్	02	02

కావాల్సినవి తెప్పిస్తాం

జిల్లాలో రూ.2.85 కోట్ల రాయితీపై 1,645 వ్యవసాయ పరికరాలు అందించేలా చూస్తున్నాం. ఇప్పటికే కొన్ని చోట్ల పరికరాలు ఇచ్చేశాం. కొందరు రైతులు పరికరాల కొనుగోలుపై ఆసక్తి చూపకపోవడంతో వాళ్లకు ఏ పరికరాలు కావాలో వాటిని తెప్పించే ప్రయత్నం చేస్తున్నాం.

– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

జిల్లాకు ఆరు సబ్‌స్టేషన్ల మంజూరు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాకు ఆరు సబ్‌స్టేషన్లు మంజూరైనట్టు ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. చిత్తూరు నగరం, గుడిపాల, యాదమరి, తవణంపల్లె, పెద్దపంజాణి, శాంతిపురం మండలాలకు ఒక్కో సబ్‌స్టేషన్ కేటాయించారన్నారు. ఒక సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.4 కోట్ల మేర మంజూరు చేశారని చెప్పారు. స్థలం ఎంపిక చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తే నిర్మాణానికి టెండర్లు పిలవనున్నట్లు వివరించారు.

ఆక్రమణలపై తనిఖీలు



కుంజేగానూరులో ఆక్రమణలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కుప్పం: మండలంలోని కుంజేగానూరు గ్రామ రెవెన్యూకు సంబంధించి గుట్ట పోరంబోకు కబ్జాపై 'సాక్షి'లో 'కుంజేగానూరులో భూచోరులు' శీర్షికన ఆదివారం వార్త వెలువడింది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆక్రమణలకు గురైన గుట్టపోరంబోకును సోమవారం పరిశీలించారు. డీకేటీ పట్టా ఉన్నా క్రయవిక్రయాలు చేయరాదన్నారు. ఓ రైతు పొలానికి ఆనుకుని ఉన్న మిట్ట పోరంబోకులో ఎవరికీ అనుమతులు లేవని, అది పశువుల మేత బీడుగా రికార్డుల్లో ఉందన్నారు. అక్కడ కట్టడాలు కట్టి కబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వరసిద్ధి వినాయకుడి సేవలో కర్ణాటక హైకోర్టు జడ్జి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామిని సోమవారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు స్వాగతం పలికి స్వామి వారి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి ప్రసాదం, స్వామి వారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్ర బాబు, సిబ్బంది బాలాజీ నాయుడు పాల్గొన్నారు.



కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తికి స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు గాయత్రీదేవి

చిత్తూరు కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ధ్వజమెత్తారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి పాలనలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్నా ఎటువంటి రక్షణా లేదన్నారు. మాజీ మహిళా మంత్రి విడుదల రజనీపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడి, చేయి చేసుకోవడం దారుణమన్నారు. మహిళల ఆత్మగౌరవం కాపాడతామని చెప్పే కూటమి నాయకులు ఏమైపోయారని నిలదీశారు. సీఐ సుబ్బనాయుడు ఆమె పట్ల దురుసుగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. ఒక బీసీ ప్రజాప్రతినిధిపై ఇలా ప్రవర్తించడం సరికాదన్నారు. మాజీ మంత్రి వద్ద ఉన్న శ్రీకాంత్ అనే వ్యక్తిని అరెస్టు చేయాలంటే వారెంట్ లేదా ఎఫ్ఐఆర్ చూపాలని, ఎటువంటి నోటీసులూ లేకుండా అరెస్టు చేయడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పోలీసులు ఎవరి మెప్పు కోసం పనిచేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి కక్ష్య సాధింపుపై ఉన్న శ్రద్ధ సంక్షేమంపై లేదని దుయ్యబట్టారు. అనంతరం నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు అంజలిరెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షురాలు సరళమేరీ, గుడిపాల మండల అధ్యక్షుడు ప్రకాష్, నాయకులు నారాయణలు మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఏ సంక్షేమ పథకమూ అమలు చేయలేదన్నారు. రజనీపై అనుచితంగా ప్రవర్తించిన సీఐ సుబ్బనాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, నాయకులు నౌషద్, చల్లాముత్తు, గిరి, చంద్ర, మదన్, కవిత, బిందు, శాంతి, దీనదయాళ్, భువన, రాజేష్, హరీషారెడ్డి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 04 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 80,423 మంది స్వామి వారిని దర్శించుకోగా 29,361 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.4 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.



జాతరకు సర్వం సిద్ధం

చిత్తూరు గ్రామదేవత గంగమ్మ తల్లి జాతరకు సర్వం సిద్ధమైంది. గంగమ్మ తల్లిని మంగళవారం వేకువ జామున కొలువుదీర్చనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడంతో భారీ ఏర్పాట్లు చేపట్టారు. సంతపేట, కొంగారెడ్డిపల్లి. ఓబన్నపల్లి, గిరింపేట, కట్టమంచి ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి 7 గంటల మధ్యలో తొలిపూజ జరగనుంది. దొడ్డిపల్లిలో సోమవారం అర్ధరాత్రి నుంచే అమ్మవారు ఇంటింటా వెళ్లి పూజలు అందుకోనున్నారు. మంగళవారం ఉదయం ఆయా వీధుల్లో కొలువుదీరనున్నారు.

– చిత్తూరు రూరల్ (కాణిపాకం)

- చిత్తూరు నగరానికి చెందిన 35 ఏళ్ల వ్యక్తి ఒళ్లు నొప్పులతో బాధపడుతూ మాత్రల కోసం గూగుల్‌ను ఆశ్రయించాడు. వాటిని వేసుకున్న తర్వాత కూడా నొప్పులు తగ్గకపోగా జ్వరం వచ్చింది. వారం రోజుల తర్వాత ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. అతనికి వైద్య పరీక్షలు నిర్వహించి సరైన చికిత్సనందిస్తే కాస్త కోలుకున్నాడు.
- బంగారుపాళ్యంకు చెందిన ఓ గృహిణి ఇంట్లో పనులు చేస్తూ కాలుజారి పడింది. యూట్యూబ్‌లో చూసి సెల్ఫ్ మెడికేషన్ వాడడం మొదలు పెట్టింది. నాలుగు రోజుల తర్వాత కూడా నొప్పి తగ్గకపోగా.. కాలు వాపు మరింత పెరిగింది. వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. నెల రోజుల పాటు చికిత్సనందించారు. బిల్లు కూడా అధిక మొత్తంలో వేశారు. గాయమైన మొదట్లోనే వైద్యుడ్ని సంప్రదించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని స్థానికులు సూచించారు.
- చిత్తూరు నగరంలోని రాజేంద్ర అనే వ్యక్తి గుండె నొప్పిగా ఉందని ఓ ప్రైవేటు డాక్టర్‌ను ఆశ్రయించాడు. ఆ డాక్టర్ (జూనియర్ డాక్టర్) క్షుణంగా పరిశీలించారు. ఇతర సమస్యలపైనా ఆరా తీశారు. తర్వాత ఆ నొప్పి ఆధారంగా.. ఏఐలో సర్చ్ చేశారు. వాటి ఆధారంగా కొన్ని ఇంజెక్షన్లు ఇచ్చి మాత్రలు ఇచ్చారు. గుండె నొప్పి తగ్గకపోగా కొన్ని ఇన్‌ఫెక్షన్‌లు వచ్చాయి.

.. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. చాలా మంది తమ సమస్యలకు సంబంధించి గూగుల్, యూట్యూబ్‌లో సెర్చ్ చేస్తున్నారు. అక్కడ సూచిస్తున్న మందులు వాడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇలా సొంత వైద్యం మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఏఐ వైద్యం.. ప్రమాదకరం!

- జిల్లాలో విద్యావంతులతో పాటు డాక్టర్లు సైతం ఏఐ ముసుగులోనే
- విచ్చలవిడిగా మందులు వాడి రోగాల పాలు
- ఏఐ సూచనలు మాత్రమే.. ట్రీట్మెంట్ చేయదంటున్న వైద్యులు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఇప్పుడు ఏ సూచన కావాలన్నా.. ఏ విషయం తెలుసుకోవాలన్నా.. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్)నే ఫాలో అవుతున్నారు. ఆరోగ్య విషయంలో కూడా దాన్నే నమ్ముకోవడం ఇప్పుడు ఆందోళన కలిగించే అంశం. కొందరు చాట్‌జీపీటీలో ఏ రోగానికి ఏ మాత్రలు వాడలో వెతుకుతూ.. అధిక డోసులు కలిగిన మందులు వాడేస్తున్నారు. ఫలితంగా కొత్త రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. చివరికి రోగం ముదిరి ప్రాణాల మీదకి రాగానే ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. అలెర్జీ ఉన్న వారికి గూగుల్ చెప్పిన మందులు వాడడం వల్ల శరీరంలో తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు ఏర్పడి రోగం ముదురుతుంది. సెల్ఫ్ మెడికేషన్ కేసులకు జిల్లా నిలయంగా మారింది. ఈ తరహా వాడకం వల్ల రోగాలు ముదిరి చివరి దశలో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. తిరుపతి స్విమ్స్, రుయా, చిత్తూరు జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో నిత్యం ఉండే ఓపీ సేవల్లో సగానికి పైగా కేసులు ఇలాంటి తరహాలోనే ఉంటున్నాయి. ఇందులో ప్రధానంగా నడివయస్సు వారే అధికంగా ఉండడం గమనార్హం. అందులోనూ విద్యావంతులు కూడా ఉంటున్నారు.

ఆన్‌లైన్ వైద్యం మంచిది కాదు



జనం టెక్నాలజీ మీద పడిపోతున్నారు. ఏం కావాలన్నా మొబైల్ ఫోన్‌లో సర్చ్ చేసి చూస్తున్నారు. ముఖ్యంగా వైద్యం విషయంలో ఈ రకమైన ప్రయత్నాలు వద్దు. ఏఐ డయోగ్నోసిస్‌లో ఉపయోగకరంగా ఉంటుంది. అంతే తప్ప వైద్యం చేయదు. డబ్బులు ఖర్చవుతాయని ఇలాంటి ట్రిక్స్ చేస్తే.. అనారోగ్య సమస్యలు తప్పవు. డాక్టరు సలహాతోనే మందులు వాడాలి.

– అశోక్‌కుమార్, వైద్యనిపుణులు, చిత్తూరు

జిల్లా సమాచారం

జిల్లా ప్రభుత్వాస్పత్రి	01
ఏరియా ఆస్పత్రి	04
సీహెచ్‌సీలు	08
అర్బన్ హెల్త్ సెంటర్లు	15
పీహెచ్‌సీలు	50

సొంత వైద్యానికి ప్రాధాన్యం

చిన్నరోగానికే వైద్యుని వద్దకు వెళితే డబ్బులు ఖర్చు అవుతాయని చాలామంది భావిస్తున్నారు. అందుకే ఆస్పత్రికి వెళ్లకుండా ఇంటర్నెట్, మెడికల్ దుకాణాలు, ఇరుగు పొరుగు వారి సలహాలతో కావాల్సిన మందులు కొని వాడుతున్నారు. నాలుగు రోజుల వరకు సమస్య తగ్గకుండా విషమిస్తే గానీ ఆస్పత్రికి వెళ్లడం లేదు. సీజనల్ వ్యాధుల విషయంలోనూ ఇదే తంతు. మలేరియా, డెంగీ లక్షణాలు ఉన్నా తేలిగ్గా తీసుకోవడం, రోగం ముదిరిన తర్వాత ఆస్పత్రిలో చేరుతున్నారు. వైద్య పరీక్షల్లో రోగం తీవ్రత తెలిసి బెంబేలెత్తిపోతున్నారు. గూగుల్, చాట్ జీపీటీల వాడకం వల్ల నిండు ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

బాల సదనం నిర్వహణకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : సూళ్లూరుపేటలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చెందిన బాలసదనం నిర్వహించేందుకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ వసంత బాయి తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నిబంధనల మేరకు సదనం నిర్వహించాల్సి ఉంటుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు తమ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో పాటు మూడేళ్ల ఆడిట్ నివేదికలను కలెక్టరేట్‌లోని బీ–బ్లాక్ రూమ్ నం.505, 506లో ఈ నెల 24 లోపు అందించాలని సూచించారు.

క్లుప్తంగా

జాతరకు కట్టుదిట్టమైన భద్రత

- చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని పలు ప్రాంతాల్లో గంగ జాతర జరుగుతున్న నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించినట్టు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఆయన సోమవారం చిత్తూరులోని ఏఆర్ మైదానంలో జాతర విధులు కేటాయించిన పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. చిత్తూరు జాతరకు దాదాపు 500 మంది పోలీసులను వినియోగిస్తున్నామని తెలిపారు. అలాగే డ్రోన్ కెమెరాలు, బాడీ కెమెరాలతో నిరంతరం నిఘా పెట్టినట్టు తెలిపారు. ట్రాఫిక్‌ను నిత్యం పర్యవేక్షించడంతోపాటు వాహనాల మళ్లింపుపై దృష్టి పెట్టాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందనే అనుమానం ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం జాతర ధర్మకర్త లావణ్యతో కలిసి నగరంలోని పలు ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రాజశేఖర్ రాజు, శివానందకిషోర్, డీఎస్పీలు సాయినాథ్, సయ్యద్ మొహ్మద్ అజీజ్, చిన్నికృష్ణ, మహబూబ్ బాష, సీఐలు మహేశ్వర, నెట్టి కంటయ్య తదితరులు పాల్గొన్నారు

సదుం తహసీల్దార్‌గా జయప్రకాష్

చిత్తూరు కలెక్టరేట్: సదుం తహసీల్దార్‌గా కుప్పం డివిజనల్ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న జయప్రకాష్‌ను నియమిస్తూ సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. అక్కడ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉన్న హుస్సేన్ అవినీతినిరోధకశాఖ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఆ పోస్టుకు జయప్రకాష్‌ను నియమించారు.

అయ్యా.. మా మొర ఆలకించరా?

కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు

- ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 234 అర్జీలు
- వినతులు స్వీకరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



సమస్యలను కలెక్టర్‌కు ఏకరువు పెడుతున్న అర్జీదారురాలు



అర్జీలు రాస్తున్న సచివాలయ ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్ : 'అయ్యా.. మా మొర ఆలకించండి' అంటూ అర్జీదారులు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో గత రెండు వారాల తర్వాత ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించగా.. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున అర్జీదారులు తరలివచ్చారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులను వేడుకున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌వో మోహన్‌కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 232 అర్జీలు వచ్చాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అర్జీలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలన్నారు. మూడు నెలల పాటు పలమనేరు డివిజన్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించామన్నారు. చిత్తూరులో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో దాదాపు 250 అర్జీలు వచ్చాయన్నారు. ఇందులో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నట్టు వెల్లడించారు. పలమనేరులో పీజీఆర్ఎస్ నిర్వహించడం వల్ల పలమనేరు డివిజన్ నుంచి అందే అర్జీల సంఖ్య తగ్గినట్టు పేర్కొన్నారు.

శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించండి

శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాలని చిత్తూరు రూరల్ మండలం, బీఎస్ఆర్‌పేట రెవెన్యూ, అనంతాపురం ఎస్సీ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ గ్రామానికి చెందిన సుకన్య, కవిత తదితరులు మాట్లాడారు. గత 40 ఏళ్లుగా శ్మశానవాటికకు వినియోగిస్తున్న స్థలంలో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నట్టు వాపోయారు. జెడ్పీ నిధులతో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

పాఠశాలను మార్చకండి



పాఠశాలను మార్చొద్దంటూ నిరసన తెలుపుతున్న మరసనపల్లె గ్రామస్తులు

తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను మార్చకండి అంటూ పుంగనూరు మండలం, మరసనపల్లెకు చెందిన గ్రామస్తులు రమణప్ప తదితరులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అర్జీ అందజేశారు. మరసనపల్లె గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోందని, ఆ పాఠశాలలో ప్రస్తుతం 22 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. త్వరలో ఆ పాఠశాలలో 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను దూరప్రాంతంలో ఉన్న ఈడిగపల్లెకు మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అలా మారిస్తే తమ పిల్లలు కిలోమీటరు వరకు కాలినడకన నడిచి పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. తమ గ్రామంలోనే పాఠశాలను కొనసాగించాలని కలెక్టర్‌ను కోరారు.

ఇళ్లను కూల్చేందుకు కుట్ర



ఇళ్లను కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారని వెల్లడిస్తున్న యాదమరి మండలం, ఆది ఆంధ్రవాడ ప్రజలు

గత 30 ఏళ్లుగా నివసిస్తున్న ఇళ్లను కూల్చివేసేందుకు కుట్రలు చేస్తున్నారని యాదమరి మండలం, దాసరపల్లి గ్రామ పంచాయతీ ఆది ఆంధ్రవాడ ప్రజలు వాపోయారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామ పరిధిలోని సర్వే నం.343/2 డీలో ఎకరా ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఆ భూమిలో గత 30 ఏళ్లుగా కొన్ని కుటుంబాలు గృహాలు నిర్మించుకుని నివసిస్తున్నట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం తమ ఇళ్లను కూల్చివేసేందుకు కుట్రలు చేస్తున్నారని వాపోయారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

మేత బీడును కాపాడండి



సమస్యను వివరిస్తున్న ఆర్‌ఆర్‌పురం ఎస్టీ కాలనీ వాసులు

ఎన్నో ఏళ్లుగా పశువులు, మేకలు, గొర్రెలు మేపుకుంటున్న భూమిని కొందరు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఎస్ఆర్‌పురం మండలం, ఆర్‌ఆర్‌పురం ఎస్టీ కాలనీ వాసులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు సమస్యను వివరించారు. తమ గ్రామ పరిధిలో సర్వే నం.170లో 18/2లో ఉన్న భూమిని మోతుబారి రైతు కుటుంబీకులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. విచారించి న్యాయం చేయాలని వారు కోరారు.

గుడి వద్ద మద్యం షాపు వద్దు



మద్యం షాపును తొలగించాలని వినతి పత్రం చూపుతున్న పచ్చికాపలం గ్రామస్తులు

గుడి వద్ద ఉన్న మద్యం షాపును తొలగించాలని వెదురుకుప్పం మండలం, పచ్చికాపలం గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. తమ గ్రామంలో చర్చి, మాతమ్మ గుడికి సమీపంలో మద్యం షాపు ఉందన్నారు. ఆ దారిలో ఆలయాలకు వెళ్లే సమయంలో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

కుప్పం రూరల్: అనుమానాస్పద స్థితిలో చెరువులో పడి గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన సోమవారం రామకుప్పం చెరువులో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం.. సుమారు 65 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధురాలు నాలుగు రోజుల క్రితం చెరువులో పడిన మృతి చెందినట్టు తెలుస్తోంది. ఐదు అడుగుల ఎత్తు కలిగి, ఎర్రగులాబీ రంగు చీర, వంకాయ పువ్వు రంగు పావడా, ఆకుపచ్చ, తెలుపు రంగుల పూసల హారం ధరించి ఉంది. రెండు చేతులపై పచ్చబొట్లు ఉన్నాయి. మృతురాలు వివరాలు ఎవరికైనా తెలిస్తే 9440900703 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రమాద వశాత్తు చెరువులో పడిందా.. లేక ఎవరైనా కొట్టి చంపి చెరువులో పడేశారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అరటి సాగులో అద్భుతాలు

గ్రూపు -1లో తప్పినా.. సాగులో సక్సెస్

- తండ్రికి అండగా నిలవాలని నిర్ణయం
- అరటి సాగు చేపట్టి అద్భుతాలు సృష్టిస్తున్న యువకుడు



కుప్పంరూరల్: గ్రూప్–1లో తప్పినా.. సాగులో సక్సెస్ అయ్యాడు కుప్పం మండలం, గుల్లేపల్లి గ్రామానికి చెందిన యువకుడు జ్ఞానప్రకాష్. అరటి సాగులో అద్భుతాలు సృష్టిస్తున్నాడు. తండ్రికి తోడూ నీడగా ఉంటూ శభాష్ అనిపించుకుంటున్నాడు.

మొదటి ప్రయత్నంలోనే సక్సెస్

కుప్పం మండలం, గుల్లేపల్లి గ్రామానికి చెందిన జ్ఞానప్రకాశ్ బీ.ఏ వరకు చదువుతున్నాడు. తన తండ్రి రెవెన్యూశాఖలో చిరుద్యోగి. గ్రూపు -1 అధికారి కావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాడు. 2023లో గ్రూపు -1 పరీక్ష రాసి సఫలీకృతుడు కాలేకపోయాడు. దీంతో తన తండ్రికి తోడుగా నిలవానుకున్నాడు. తనకున్న ఐదు ఎకరాల పొలంలో అరటి సాగుకు ఉపక్రమించాడు. రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టి 2.5 ఎకరాల్లో పచ్చివాల, 2.5 ఎకరాల్లో యాలక్కి రకాలు సాగుచేశాడు. ప్రస్తుతం పంట మరో నెలలో చేతికి రానుంది. కుప్పం మార్కెట్‌లో యాలక్కి కిలో రూ.70, పచ్చివాల రూ.30 ధర పలుకుతోంది. ఈ లెక్కన జ్ఞానప్రకాష్‌కి రూ.25 లక్షల వరకు ప్రతిఫలం వచ్చే అవకాశం ఉంది.

తోడైన దేవుడు

యువకుడు పడుతున్న కృషికి దేవుడు కూడా తోడయ్యాడు. కుప్పం ప్రాంతంలో వెయ్యికిపైగా అడుగుల లోతుకు బోరు వేసినా నీరు వచ్చే పరిస్థితి లేదు. కానీ జ్ఞానప్రకాశ్ అరటి సాగుకు రెండు బోర్లు తవ్వగా.. కేవలం 105, 160 అడుగుల్లోన్నే పుష్కలంగా నీరు లభించింది.

పాడి సాగులో మరో లక్ష ఆదాయం

గత ఏడాది నుంచి జ్ఞానప్రకాష్ పాడి పెంపకం కూడా చేపట్టాడు. అరటి తోటలో వచ్చే పశుగ్రాసం, అరటి ఆకులు దాణాగా వినియోగిస్తున్నాడు. తండ్రి సహకారంతో రూ.5 లక్షలు ఖర్చు చేసి 10 పాడి ఆవులను పెంచుతున్నాడు. ప్రస్తుతం రోజూ ఆవులు పూటకు 75 లీటర్ల లెక్కన రెండు పూటలా 150 లీటర్ల వరకు పాలు ఇస్తున్నాయి. నెలకు రూ.1.2 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది.



జ్ఞానప్రకాశ్ సాగులోని పాడి ఆవులు

గ్రూపు -1 ఆఫీసర్ కావాలనుకున్నా



మా తండ్రి రెవెన్యూ శాఖలో చిరుద్యోగి. ఆయన పడుతున్న బాధలు చూడలేక చిన్నప్పటి నుంచే గ్రూపు -1 ఆఫీసర్ కావాలనుకున్నా. మొదటి ప్రయత్నంలో ఒక్క పరీక్ష పోయింది. మరో పరీక్ష కోసం ఎదురు చూస్తున్నా. ఇంతలో ఎలాగైనా తండ్రికి తోడుగా నిలవాలనుకున్నా. అదుకే 5 ఎకరాల పొలంలో రూ.5 లక్షలు వెచ్చించి అరటి సాగు చేపట్టా. వ్యాపారులు వచ్చి టోకుగా రూ.25 లక్షలకు తోటను అడుగుతున్నారు. బయట మార్కెట్‌కు తరలిస్తే మరింత లాభం వచ్చే అవకాశం ఉంది. – జ్ఞానప్రకాష్, యువ రైతు, గుల్లేపల్లి, కుప్పం మండలం

మా భూములు లాక్కోవద్దు

- ఎయిర్‌పోర్ట్ బాధితుల మొర • తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత

శాంతిపురం: విమానాశ్రయం పేరుతో తమకు జీవనాధారమైన వ్యవసాయ భూములను లాక్కోవద్దని శాంతిపురం – రామకుప్పం మండల సరిహద్దు గ్రామాల ప్రజలు వాపోయారు. వారు సోమవారం తహసీల్దార్ శివయ్యకు వినతి పత్రం అందజేసేందుకు బయలుదేరారు. వారిని పోలీసులు దండికుప్పం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అడ్డుకుని తహసీల్దారునే అక్కడికి పిలిపించారు. రైతులు మాట్లాడుతూ టైడిల్ సిల్క్ పరిశ్రమ పేరుతో అమ్మవారి పేట రెవెన్యూ పరిధిలో 2003లో తీసుకున్న భూములకు ఇప్పటి వరకూ పరిహారం ఇవ్వలేదన్నారు. పరిశ్రమ కూడా ఏర్పాటుచేయలేదన్నారు. అదేవిధంగా కార్గో ఎయిర్‌పోర్టు కోసమని 2016– 17లో అమ్మవారిపేట, రామకుప్పం మండలంలోని కిలాకిపోడు, కడిసిన కుప్పం, మణేంద్రం రెవెన్యూల పరిధిలో భూములు తీసుకున్నారని చెప్పారు. వాటిలోనూ ఎలాంటి పనులు చేపట్టలేదన్నారు. మళ్లీ ఇప్పుడు పరిశ్రమల పేరుతో శాంతిపురం మండలంలోని దండికుప్పం, అమ్మవారిపేట, 30 సొన్నేగానిపల్లి, రామకుప్పం మండలంలోని కిలాకిపోడు, కడిసినకుప్పం, మణేంద్రం రెవెన్యూల పరిధిలో భూ సేకరణ చేయవద్దని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే టైడిల్ పరిశ్రమ, ఎయిర్‌పోర్ట్, హంద్రీనీవా కాలువ, గ్యాస్ పైపులైన్ కోసం రైతులు భూములు కోల్పోయారని చెప్పారు. తహసీల్దార్ మాట్లాడుతూ కార్గో విమానాశ్రయం తోపాటు ఇప్పుడు డొమెస్టిక్ కూడా నిర్మించాలని నిర్ణయించడంతో అదనంగా 700 ఎకరాల భూమి కావాలన్నారు. పరిశ్రమల కోసం క్రిష్ణేపల్లి సమీపంలోని భూములను పరిశీలించామన్నారు. వైఎస్సార్ సీపీ రామకుప్పం మండల కన్వీనర్ విజలాపురం బాబు, నాయకుడు పెద్దన్న పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ: ఒకరి మృతి

గుడిపాల: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతిచెందాడు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. ఎస్ఐ రామ్మోహన్ కథనం.. మండలంలోని వసంతాపురం గ్రామానికి చెందిన మహేష్(37), ముటుకూరు గ్రామానికి చెందిన వ్యక్తి మరో ద్విచక్ర వాహనాలపై వస్తూ గుడిపాల క్రాస్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇందులో మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 ద్వారా ద్వారా చీలాపల్లె సీఎంసీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

చిత్తూరు కలెక్టరేట్ : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం ఆ సంఘం నాయకులతో కలిసి డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ, బదిలీలు, ఉద్యోగోన్నతుల అంశాల్లో అనుసరిస్తున్న వైఖరి సరికాదన్నారు. గుర్తింపు పొందిన సంఘాలతో నిర్వహిస్తున్న సమావేశాల్లో టీచర్లలో ఆందోళన కలిగిస్తున్న అంశాలను పట్టించుకోవడం లేదన్నారు. జీవో 117 అమలు వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి తరలిపోయారన్నారు. హైస్కూల్స్‌లో 54 మంది విద్యార్థులు ఉంటేనే 2వ పోస్టు కేటాయిస్తామని మెలిక పెట్టడం సబబు కాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్ మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో 46 మంది విద్యార్థులు ఉంటే 2వ సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ స్కూల్స్‌లో 1:20 ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్‌లను యూపీ స్కూల్స్‌లోనే వినియోగించాలన్నారు. ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పి సుధాకర్ రెడ్డి, సహాధ్యక్షులు ఎస్.రెహనాబేగం, కె.రెడ్డెప్ప నాయుడు, కోశాధికారి కే.ప్రసన్నకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.దీనావతి, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్పీ బాషా, పిఆర్ మునిరత్నం, రఘుపతి రెడ్డి పాల్గొన్నారు.

రగులుతున్న తమ్ముళ్లు!



నామినేటెడ్ పోస్టుల భర్తీపై టీడీపీ సీనియర్ నేతలు తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీకి సేవలందిస్తే కనీస గౌరవం దక్కడం లేదని ఆవేదన చెందుతున్నారు. కూటమి గెలుపు కోసం అహర్నిశలు శ్రమిస్తే అసలు గుర్తింపే లేకుండా పోయిందని వాపోతున్నారు. ఎన్నికల ముందు కండువా కప్పుకున్న వారికే పదవులు కేటాయించడంపై మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు నాయకులు తమ స్థాయికి తగని పోస్టులు కట్టబెట్టడంపై కినుక వహిస్తున్నారు. ఇంతకాలం ఎదురుచూసినందుకు ఇంతగా అవమానిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- నామినేటెడ్ పదవుల పందేరంపై అసంతృప్తి
- గుర్తింపు.. గౌరవం లేదని సీనియర్ నేతల ఆవేదన
- ప్రాధాన్యత లేని పోస్టులు కట్టబెట్టడంపై మండిపాటు
- తిరుపతి, చిత్తూరు జిల్లాల టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు గుర్తింపు, గౌరవం రెండూ లేవని కొందరు టీడీపీ నేతలు మధనపడుతున్నారు. మొదటి నుంచి పార్టీ విజయం కోసం పనిచేసిన తమను కాదని ఎన్నికల ముందు చేరిన వారికి ఉన్నత పదవులు కట్టబెట్టడంపై మండిపడుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అతి ముఖ్యమైన తుడా చైర్మన్ పదవిని డాలర్స్ దివాకర్‌రెడ్డికి, మొన్న డీసీసీబీ చైర్మన్ పోస్టును అమాస రాజశేఖరరెడ్డికి ఇవ్వడంతో నామినేటెడ్ పదవులన్నీ దాదాపు భర్తీ పూర్తయినట్లేనని కూటమి నేతలు చెబుతున్నారు. ఈ రెండు పదవులు తమకే వస్తాయని ఆశగా ఎదురుచూసిన టీడీపీ సీనియర్ నేతలు నైరాశ్యంలో మునిగిపోయారు. ఇక నామినేటెడ్ పదవుల్లో ఆశించేందుకు ఏమీ లేకుండా పోయినట్లేనని ఆగ్రహంగా ఉన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో టీడీపీలో అనేక మంది సీనియర్ నేతలు ఉన్నారు. అలాగే టీడీపీ కోసం తెరవెనుక నుంచి పనిచేసిన కాంట్రాక్టర్లు కూడా ఉన్నారు. వారంతా ముందుగా టీటీడీ పాలకమండలి సభ్యత్వం కోసం పోటీపడ్డారు. అలా ఆశించిన వారిలో జిల్లాకు చెందిన టీడీపీ నేతలెవరికీ టీటీడీ పాలకమండలిలో చోటు దక్కలేదు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ద్వారా బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి టీటీడీ బోర్డు మెంబర్ పోస్టును ఎగరేసుకుపోయారు. ఎన్టీఆర్ హయాం నుంచి టీడీపీనే నమ్ముకునిఏళ్లుగా ఎదురుచూస్తున్న వారందరికీ భంగపాటు తప్పలేదు.

చిత్తూరు జిల్లాలోనూ..

చిత్తూరు జిల్లా పరిధిలోని కుప్పం, పుంగనూరు, పూతలపట్టు, చిత్తూరు, జీడీ నెల్లూరు, నగరి నియోజక వర్గాల్లో పదుల సంఖ్యలో ఉన్న టీడీపీ నాయకులందరికీ కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపించింది. డీసీసీబీ చైర్మన్ పదవి కోసం మాజీ ఎమ్మెల్సీ దొరబాబు చాలా నమ్మకంగా ఉన్నారు. జిల్లాలో సీనియర్ నాయకుల్లో ప్రథముడు. టీడీపీనే నమ్ముకుని ఉన్నారు. అయితే దొరబాబుని కాదని, అమాస రాజశేఖరరెడ్డికి చైర్మన్ గిరీ కట్టబెట్టారు. ఆయన గతంలో డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న సమయంలో అడ్డగోలుగా కుప్పం నియోజక వర్గానికి నిధులు కేటాయించారే విషయాన్ని పరిగణలోకి తీసుకున్న చంద్రబాబు, లోకేష్ మళ్లీ అమాసకే డీసీసీబీని కట్టబెట్టారు. అమాస కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరినట్లు కూడా పెద్దగా ప్రచారం లేదు. అదే విధంగా టీడీపీ కోసం పెద్దగా ప్రచారం చేసిన దాఖలాలు కూడా లేవని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. చిత్తూరు జిల్లాలో మిగిలింది కాణిపాకం, బోయకొండ పాలకమండళ్లు మాత్రమే. ఆయా బోర్డుల చైర్మన్, సభ్యత్వం కోసం అనేక మంది ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. అందులోనైనా న్యాయం జరుగుతుందా? లేదా? అని పలువురు టీడీపీ నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్లందరికీ అవమానం

తిరుపతికి చెందిన ఎన్టీఆర్ రాజు కుటుంబం ఎన్నో ఏళ్ల నుంచి టీటీడీ బోర్డు సభ్యత్వం కోసం ఎదురుచూస్తూనే ఉంది. ఈ సారి కూడా ఆ కుటుంబానికి దక్కలేదు. తిరుపతిలో టీడీపీ అంటే గుర్తొచ్చే నాయకుల్లో ముందు వరుసలో ఉండేది నరసింహయాదవ్. టీడీపీ సీనియర్ నేతగా పచ్చ చొక్కా తప్ప మరొకటి ధరించని నరసింహయాదవ్ మరో పర్యాయం తుడా చైర్మన్ పదవిని ఆశించారు. అయితే ఆయనకు ప్రాధాన్యం లేని పదవిని కట్టబెట్టి తీవ్రంగా అవమానించారు. టీడీపీలో మరో నేత మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ. ఆమె ఎమ్మెల్సీ లేదా టీటీడీ పాలకమండలి సభ్యత్వం, అది కూడా కాకుంటే తుడా చైర్మన్ పదవిని ఆశించారు. అయితే ఈ మూడింటిలో ఏదీ దక్కలేదు. అస్సలు ఎలాంటి ప్రాధాన్యత లేని, ఆ పదవి ఒకటి ఉందనే విషయం తెలియని గ్రీనింగ్ మరియు బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ పోస్టును ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మతో పాటు, ఆమె అనుచరులంతా తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. తిరుపతి జిల్లాలో అతిముఖ్యమైన తుడా చైర్మన్ పదవిని రియల్ ఎస్టేట్ వ్యాపారికి కట్టబెట్టడంపై టీడీపీలోని అనేక మంది నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దివాకర్‌రెడ్డిపై అనేక ఆరోపణలు ఉన్నాయని, అందుకు సంబంధించిన వివరాలతో అమరావతికి లేఖ పంపినట్లు తెలిసింది. పార్టీ కోసం నమ్మకంగా పనిచేస్తున్నా తమను గుర్తించలేదంటూ కొందరు నాయకులు అధిష్ఠానంపై కారాలు మిరియాలు నూరుతున్నారు. అదే విధంగా శాప్ చైర్మన్ రవినాయుడుపైనా కొందరు టీడీపీ నేతలు అమరావతికి ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. తిరుపతి జిల్లాలో మిగిలిన శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి కోసం పలువురు టీడీపీ నేతలు ఎదురుచూస్తున్నారు.